క్లుప్తంగా

నేడు కోటి సంతకాల సేకరణ

పెడన: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని బుధవారం కృత్తివెన్ను మండలంలో ప్రారంభించనున్నట్లు ఆ పార్టీ పెడన కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము ఆధ్వర్యంలో ఉదయం తొమ్మిది గంటలకు మండలంలోని చిన్న గొల్లపాలెం గ్రామంలో సంతకాల సేకరణ ఉంటుందని తెలిపింది. అలాగే 11 గంటలకు పడతడికలోనూ, మధ్యాహ్నం ఒంటి గంటకు పల్లెపాలెంలో, మధ్యాహ్నం మూడు గంటలకు లక్ష్మీపురం, సాయంత్రం ఐదు గంటలకు నిడమర్రులో గ్రామంలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపింది. తొలుత గ్రామ కమిటీలు నియామకం జరుగుతుందని పేర్కొంది.

రెవెన్యూ ఉద్యోగుల సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక



చిలకలపూడి(మచిలీపట్నం): ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ మచిలీపట్నం రెవెన్యూ డివిజన్‌కు సంబంధించి నూతన కార్యవర్గ ఎన్నికను మంగళవారం నిర్వహించారు. స్థానిక రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా ఎం.హరినాథ్ వ్యవహరించారు. నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా మైనంపూడి యాకూబ్, గౌరవాధ్యక్షురాలిగా బి.కనకదుర్గ, ఉపాధ్యక్షులుగా కె.అనిల్‌కుమార్, ఎల్.వి.ఎన్.ఆర్.కె.శశికుమార్, పి.కల్పన, కార్యదర్శిగా కె.శివప్రసాద్, సంయుక్త కార్యదర్శులుగా కె.జి.ఎన్.సాయి, సీహెచ్.చంద్రశేఖర్, జి.మందులు, కోశాధికారిగా బి.శివశంకర్, కార్యవర్గ సభ్యులుగా కె.విశ్వనాథ్, కె.శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు.


కలెక్టరేట్ యూనిట్..

ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కలెక్టరేట్ యూనిట్ ఎన్నికలను స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశం హాలులో మంగళవారం నిర్వహించారు. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా ఆర్డీఓ కార్యాలయ ఏఓ రంగారావు వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా వి.సుభాష్‌చంద్ర, అసోసియేట్ అధ్యక్షుడిగా తూము వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా మీర్జా రిజ్వానుల్లాబేగ్, ఎం.మణికుమార్, షేక్ వహీదా రహమాన్, సెక్రటరీలుగా అక్బర్ ఖాన్, ఆర్.కోటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీలుగా దివ్యశ్రీ లక్ష్మి, నాగమల్లేశ్వరరావు, కోశాధికారిగా పి.ఎన్.వి.రాజేశ్వరాచార్యులు, కార్యవర్గ సభ్యులుగా రాము, షకీరుల్లాను ఎన్నుకున్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

మచిలీపట్నంటౌన్: స్థానిక పరాసు పేటలో వేంచేసి ఉన్న శ్రీ సువర్చల సమేత ఆంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. భక్తులు గుడిసేవ జోగయ్య, గుడిసేవ నందసాయి, రఘు, వంశీల ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ తిక్కిశెట్టి వీర వెంకట రామ్మోహనరావు పర్యవేక్షించారు.

నూతన ఉపాధ్యాయులకు మెటీరియల్ అందజేత



గూడూరు: డీఎస్సీ ద్వారా ఎంపికై గూడూరు మండలం మల్లవోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోస్టింగ్ పొందిన నూతన ఉపాధ్యాయులకు మంగళవారం ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అంబటిపూడి సుబ్రహ్మణ్యం మెటీరియల్ అందజేశారు. కొత్తగా ఉద్యోగ బాధ్యతల్లో చేరిన ఉపాధ్యాయులు సమర్పించాల్సిన ఫారమ్స్‌తో కూడిన కిట్లను అందజేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం ఎందరో చిన్నారులకు ఉజ్వల భవిష్యత్తు అందించే గురుతర బాధ్యతలు తీసుకున్న ఉపాధ్యాయులను అభినందించారు.

ఘనంగా గ్యార్మీ వేడుకలు



చల్లపల్లి: స్థానిక పడమర వీధిలోని జండా చెట్టు వద్ద మహబూబే సుభానీ గ్యార్మీ వేడుకలు మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు తమ అభిమాన ప్రవక్త మహబూబె సుభానీని స్మరించుకుంటూ జెండా చెట్టు వద్ద గౌసేపాక్, ఖాజా గరీబుల్ నవాజుల నూతన జెండాలు ఏర్పాటు చేసి గంధం, ధుని సమర్పించారు. కార్యక్రమంలో గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ హసీం బేగ్, నాటక అకాడమీ డైరెక్టర్ పైడిపాముల స్వప్న, కమిటీ నాయకులు పఠాన్ జిలానీ, పీఏసీఎస్ చైర్మన్ బొందలపాటి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

దుర్గంధం.. స్వాగతం



ప్రధాన రహదారిపైకి చేరుతున్న డంపింగ్ యార్డులోని చెత్త, మురుగునీరు



రోడ్డు మార్జిన్‌లో తామర చెరువులో తొలగించిన గుర్రపు డెక్క కుప్పలు

- పట్టణ శివారులో డంపింగ్ యార్డు నుంచి రోడ్డుపైకి చెత్త, మురుగునీరు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

పెడన: పెడన పట్టణంలోకి వచ్చే వారికి, పట్టణం నుంచి వెళ్లే వారికి డంపింగ్ యార్డ్ నుంచి వచ్చే దుర్గంధం తీవ్ర ఇబ్బంది కలిగిస్తోంది. పెడన నుంచి గుడివాడ వెళ్లే ప్రధాన రహదారి పక్కనే డంపింగ్ యార్డు ఉంది. దీంతో పాటు అక్కడ వేస్తున్న చెత్తకాస్తా బాగా పేరుకుపోయింది. ఈ చెత్తకుప్పలు అధికం కావడంతో ఆ చెత్త కాస్తా రోడ్డుపైకి చేరుతోంది. పొడిగా ఉన్న సమయంలో గాలికి దుమ్ముధూళి రూపంలో కొట్టుకుపోతూ వాహనదారుల కళ్లలోను పడుతున్నాయి. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం వర్షాలు అధికంగా కురుస్తుండటంతో చెత్త పైకి లేవకుండా వర్షం నీటికి రోడ్డుపైకి చేరి చిందరవందరగా ఉంటోంది. దీనికి తోడూ తీవ్ర దుర్గంధం వేస్తుండటంతో ముక్కులు అదిరిపోతున్నాయి. ఈ డంపింగ్ యార్డుకు కూతవేటు దూరంలో పెడన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. వాహనదారులతో పాటు ఈ ఆసుపత్రికి వెళ్లే రోగులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. దీనిని మచిలీపట్నం మెడికల్ కళాశాలకు అనుసంధానం చేయడంతో నిత్యం మెడికల్ విద్యార్థులు పెడన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శిస్తుంటారు. విద్యార్థులు, సిబ్బంది ఇదేం దుస్థితి రా బాబూ.. అంటూ ముక్కులు మూసుకునే పరిస్థితి. తాజాగా ఈ డంపింగ్ యార్డుకు ఎదురుగా తామరచెరువులో ఇటీవల గుర్రపు డెక్క తొలగించారు. ఈ గుర్రపు డెక్కను సైతం రోడ్డు మార్జిన్‌లో వేయడంతో రెండు పక్కల లారీలు, బస్సులు, కార్లు వచ్చిన సమయంలో ద్విచక్ర వాహనాలు తప్పుకునేందుకు వీలు లేని దుస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



వర్షాల వల్ల కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. సంబంధిత విభాగం వారికి సమాచారం ఇచ్చి తక్షణం చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేస్తాం. చెరువులో తొలగించిన గుర్రపు డెక్కను కూడా తీయించేలా ఏఈకి తెలియజేస్తాం. దుర్గంధం రాకుండా బ్లీచింగ్, సున్నం చల్లించేలా చర్యలు తీసుకుంటాం.

ఎల్.చంద్రశేఖరరెడ్డి, కమిషనర్, పురపాలక సంఘం, పెడన

కౌలు కార్డులు మంజూరు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు

మోపిదేవి: భూ యజమాని సంతకంతో పనిలేకుండా కౌలు కార్డులు మంజూరు చేయాలని కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి మరీదు సురేష్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కౌలు రైతు సంఘం ఆధ్వర్యాన తహసీల్దార్ ఎం.హరనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నేతలు ఎన్నికల ముందు నూతన కౌలు చట్టం తెస్తామని.. అధికారంలోకి రాగానే భూ యజమానితో సంబంధం లేకుండా గ్రామ సభల ద్వారా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అన్నదాత సుఖీభవ కింద రూ. 20 వేలు పెట్టుబడి సాయం అందించాలని, దేవదాయ భూముల్లో కౌలు రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంటల రుణాలు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు బెజవాడ నాగేశ్వరరావు, అబ్బూరి నాంచారయ్య, సుబ్రహ్మణ్యం, పి.శ్రీనివాసరావు, బెజవాడ రామారావు, ఎల్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో యువత పాత్ర కీలకం



ఎన్‌ఎస్‌ఎస్ ముగింపు సభలో మాట్లాడుతున్న డాక్టర్ సుధారాణి

ఘంటసాలపాలెం(ఘంటసాల): సమాజాభివృద్ధిలో యువత పాత్ర కీలకమైందని ఘంటసాలపాలెం సర్పంచ్ దోనె రజనీ అన్నారు. ఘంటసాల మండలంలోని ఘంటసాలపాలెం గ్రామంలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థినులు ఎన్ఎస్ఎస్ వారం రోజుల సేవా కార్యక్రమాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా సర్పంచ్ రజనీ మాట్లాడుతూ ఘంటసాలపాలెం గ్రామంలో వారం రోజులపాటు ఎన్ఎస్ఎస్ ద్వారా పర్యావరణ పరిరక్షణ, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో న్యూట్రీ గార్డెన్స్, మొక్కలు నాటడంతోపాటు ప్లాస్టిక్ వాడకం నిర్మూలన, డ్రగ్స్ వ్యతిరేకంగా ఆరోగ్యంపై అవగాహన, మహిళలకు వివిధ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం ఆదర్శనీయమని పేర్కొన్నారు. కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదిగి వ్యవసాయాభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ముందుగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నిర్వహించిన ఆయా కార్యక్రమాల ఫొటో గ్యాలరీ ప్రదర్శించారు. అనంతరం సర్పంచ్ రజనీని విద్యార్థులు సత్కరించడంతో పాటు క్విజ్ పోటీల్లో విజేతలైన మహిళలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు కృష్ణవేణి ఎం.వెంకటలక్ష్మి, సామాజిక విజ్ఞాన కళాశాల ఎన్ఎస్ఎస్ ఇంచార్జి డాక్టర్ వై.బింధ్య, డాక్టర్ కె.ధనశ్రీ, విద్యార్థినులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఆర్గానిక్ ప్యాడ్స్ పంపిణీ



దాత హన్సికను అభినందిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

అవనిగడ్డ: స్టాక్ ద రూమ్స్ ఆర్గనైజేషన్ ఫౌండర్ తూము హన్సిక (యూఎస్ఏ) ఆధ్వర్యంలో 2,500 మంది కళాశాల విద్యార్థినులకు ఆర్గానిక్ ప్యాడ్స్ పంపిణీ చేశారు. అవనిగడ్డ మండలం రామచంద్రాపురంలోని ఏ-కన్వెన్షన్‌లో మంగళవారం ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చేతుల మీదుగా ప్యాడ్స్ అందజేశారు. దాత హన్సిక మాట్లాడుతూ సాధారణ ప్యాడ్స్ వినియోగంతో ఎదురయ్యే సమస్యలు గుర్తించి తమ స్వగ్రామం కె.కొత్తపాలెంకు పేరు తెచ్చేలా నియోజకవర్గంలోని 2,500 మంది విద్యార్థినులకు ఆర్గానిక్ ప్యాడ్స్ అందించినట్లు తెలిపారు. అనంతరం థట్‌వేవ్ సాఫ్ట్‌వేర్ అండ్ సొల్యూషన్స్ చైర్మన్ తూము రమేష, హన్సిక అతిథులను, నిర్వాహకులను సత్కరించారు. కార్యక్రమంలో బొండాడ గ్రూప్ చైర్మన్ బొండాడ రాఘవేంద్రరావు, ప్రముఖ సినీదర్శకుడు తరుణ్ భాస్కర్ మాతృమూర్తి, నటి గీతా భాస్కర్, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ నల్లపనేని కీర్తి, ఆలీవ్ మిఠాయి అధినేత ఆలీవ్ దొరరాజు, మండలి వెంకట్రామ్, ఎస్‌వీఎల్ క్రాంతి విద్యా సంస్థల చైర్మన్ దుట్టా ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ దుట్టా శివరామప్రసాద్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషారాణి, వివేకానంద డిగ్రీ కళాశాల చైర్మన్ యార్లగడ్డ శివప్రసాద్, ప్రిన్సిపాల్ అబ్దుల్ రహీమ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఈ-క్రాఫ్ నమోదు చేసుకున్న రైతులకే నష్టపరిహారం



తెలుగురావుపాలెం లంకభూముల్లో కంద పంటను పరిశీలిస్తున్న హార్టికల్చర్ అధికారిణి కీర్తి

తెలుగురావుపాలెం(ఘంటసాల): ఈ-క్రాఫ్ నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే నష్టపరిహారం నమోదు చేయడం జరుగుతుందని పామర్రు హార్టికల్చర్ అధికారిణి జె.కీర్తి తెలిపారు. ఘంటసాల మండలం తెలుగురావుపాలెం, శ్రీకాకుళం లంక భూముల్లో ఇటీవల వరదలకు మునిగి నష్టపోయిన కంద, పసుపు, కూరగాయల పంటలను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కీర్తి మాట్లాడుతూ తెలుగురావుపాలెం లంకభూముల్లో పసుపు పంట బాగానే ఉందని కంద పంట నష్టపోగా, శ్రీకాకుళం లంక భూముల్లో కూరగాయలు, కంద పంట నష్టపోయినట్లు గుర్తించి నమోదు చేస్తున్నట్లు వివరించారు. పసుపులో హైబ్రిడ్ విత్తనం వేసిన ఒక్కో రైతుకు ఒక ఎకరానికి మాత్రమే రూ.16 వేల రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. ఉద్యాన శాఖ తరుపున పొలం, పాస్ పుస్తకం ఉండి ఈ-క్రాఫ్ నమోదు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ రైతులకు 50 శాతం రాయితీపై వ్యవసాయ యంత్రపరికరాలు అందించనున్నట్లు తెలిపారు. అర్హులైన రైతులు దరఖాస్తులు చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో తెలుగురావుపాలెం సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు, పలువురు రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు

రూ. 8.74 లక్షలు అపరాధ రుసుం వసూలు



కె.కొత్తపాలెంలో మాట్లాడుతున్న విద్యుత్ విజిలెన్స్ అధికారి వాసు

కె. కొత్తపాలెం(మోపిదేవి): మండలంలో విద్యుత్ విజిలెన్స్ అధికారులు మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సి.హెచ్. వాసు, ఉయ్యూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వి. సుధాకర్ ఆధ్వర్యంలో విద్యుత్ కనెక్షన్స్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉయ్యూరు డివిజన్ డీఈఈ, ఏఈ, జూనియర్ ఇంజినీర్, సిబ్బందితో కలసి 25 బృందాలుగా ఏర్పడి అన్ని సర్వీసులను తనిఖీలు చేసినట్లు తెలిపారు. అందులో అనుమతించిన లోడ్‌కు మించి అదనపు లోడు వాడుకుంటున్న 288 సర్వీసులను గుర్తించి రూ. 8.74 లక్షలు, విద్యుత్ చౌర్యం కింద మూడు సర్వీసులు గుర్తించి వాటి నుంచి రూ. 20 వేలు అపరాధ రుసుం విధించినట్లు పేర్కొన్నారు. విద్యుత్ చౌర్యం నేరమని అలాంటి వాటిని గుర్తిస్తే 94408 12091, 94408 12363 నంబర్లకు తెలియజేయాలని సూచించారు.

నేడు స్వామివారి హుండీ కానుకల లెక్కింపు

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానంలో భక్తులు సమర్పించిన కానుకల హుండీ లెక్కింపు బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సమక్షంలో నిర్వహించే కానుకల లెక్కింపులో పాల్గొనే భక్తులు డ్రెస్ కోడ్‌లో పాల్గొనవచ్చునని సూచించారు. కానుకల లెక్కింపు కారణంగా స్వామివారి నిత్యకల్యాణం బుధవారం ఉదయం ఏడు గంటలకు ప్రారంభించడం జరుగుతుందని ఆయన వెల్లడించారు.

జగనన్న కాలనీల్లో వసతులు కల్పించండి

జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



ఘంటసాల జగనన్న కాలనీ-2లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

ఘంటసాల: ఘంటసాల గ్రామంలోని జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు గృహాలు మంజూరైన లబ్ధిదారుల ఇళ్ల సత్వరమే పూర్తి చేసుకునేలా చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రం ఘంటసాల గ్రామంలోని జగనన్న కాలనీ లేఅవుట్ - 2లో కూటమి ప్రభుత్వం వచ్చాక పూర్తయిన 14 గృహాలను, గోటకం ఏ, బీ కాలనీలు, పెద్దగూడెంలో సొంత స్థలాల్లో నిర్మించిన ఆరు గృహాల నిర్మాణ పురోగతిని మంగళవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా హౌసింగ్ ఏఈ జి.సురేంద్ర ఘంటసాల జగనన్న కాలనీ-2లో 257 గృహాలు మంజూరు చేయగా, 117 పూర్తయ్యాయని, మిగిలిన గృహాలు వివిధ దశల్లో ఉన్నాయని కలెక్టర్‌కు వివరించారు.

కనీస వసతులు కరువు

జగనన్న కాలనీలో పర్యటించిన కలెక్టర్‌కు లబ్ధిదారులు లేఅవుట్‌లో రహదారులు లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. డ్రైయినేజీ సౌకర్యం లేక మురుగునీరు రోడ్ల పైకి వస్తున్నాయని, వర్షం వస్తే నీరు రోడ్లపై నిలిచిపోతుందని, తాగునీటి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని కనీస వసతులు కల్పించాలని కలెక్టర్‌కు విన్నవించారు. పల్లపు ప్రాంతం కావడంతో ఇళ్ల నిర్మాణానికి మెరక చేయడానికి పునాదికి ఎక్కువ ఖర్చు అవుతోందని తెలిపారు. ఆయా సమస్యలపై స్పందించిన కలెక్టర్ బాలాజీ జలజీవన్ మిషన్ ద్వారా మంచినీరు సరఫరా అయ్యేలా చూస్తామని, ప్రస్తుతం చేతి పంపులు వేసి తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అలాగే మిగితా సమస్యలను కూడా వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. పర్యటనలో గృహ నిర్మాణ శాఖ పీడీ ఎస్.పోతురాజు, ఉయ్యూరు ఈఈ బుజ్జిబాబు, ఎంపీడీవో డి.సుబ్బారావు, తహసీల్దార్ బి.విజయప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుగుణ కుమారి, డెప్యూటీ ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, ఆర్‌ఐ కె.శ్రీనివాస్, ఇన్‌చార్జి ఏపీఎం, ఏఈపీవో శ్రీనివాసరావు, రాజ్‌కుమార్, ఇన్‌చార్జి ఏఈ బి.అర్జునరావు ఇంజినీరింగ్ సహాయకులు తేజస్వి, స్నేహ, సతీష్, నవనీత్, కార్తీక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జీఎస్టీ2.0తో ప్రజలకు ఎంతో మేలు



మచిలీపట్నంలో జీఎస్టీపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

మచిలీపట్నంటౌన్: కేంద్ర ప్రభుత్వం సవరించిన జీఎస్టీ2.0తో రైతులకు, ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని జిల్లా అగ్రికల్చరల్ వాణిజ్య మార్కెటింగ్ అధికారి ఎల్.నిత్యానందం పేర్కొన్నారు. నగరంలోని 45వ డివిజన్‌లో ఉన్న రైతు బజార్‌లో మంగళవారం రైతులకు, ప్రజలకు జీఎస్టీపై అవగాహన కల్పించేందుకు కరపత్రాల పంపిణీ, జీఎస్టీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణలతో వ్యాపార, వాణిజ్య రంగాలకు కొత్త ఊపు వచ్చిందని, వినియోగదారులకు పెద్ద ఎత్తున ప్రయోజనాలు లభిస్తున్నాయని తెలిపారు. రైతులకు వ్యవసాయ డ్రోన్లు, పిచికారి యంత్రాలు, ఔషధాలు, వరి కోత యంత్రాలు, ట్రాక్టర్లు వంటి పరికరాలపై జీఎస్టీ తగ్గింపుతో భారీ ఊరట కలుగుతుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచె నాని, సచివాలయ సిబ్బంది అశ్వధాటి రామాంజనేయులు, జె.ప్రత్యూష, వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ భాస్కర్ రావు, సూపరింటెండెంట్ శ్రీనివాస్, రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ ఎల్.బలి చక్రవర్తి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చోడవరపు లక్ష్మీప్రసూన, నాయకులు పి.వి. ఫణికుమార్, మంచాల రాంబాబు, విన్నకోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన సదస్సు

గూడూరు: జీఎస్టీ2.0పై గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ స్లాబులతో సామాన్య ప్రజలకు ఎంతో లబ్ధి కలుగుతుందన్నారు. వన్ నేషన్ - వన్ జీఎస్టీ లక్ష్యంతో గతంలో ఉన్న స్లాబులను కుదించారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.సౌజన్య కుమారి, తహసీల్దారు డి.రాజ్యలక్ష్మి, ఏఓ కె.వి.రామకృష్ణ, డీసీ చైర్మన్ పోతన స్వామి తదితరులు పాల్గొన్నారు.

కాపు సంక్షేమ భవన నిర్మాణం ఎప్పుడో..?



ముళ్లపొదల్లో ఉన్న కాపు సంక్షేమ భవన శిలాఫలకం

కోడూరు: కాపుల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. 2014లో జరిగిన ఎన్నికల్లో అప్పటి టీడీపీ ప్రభుత్వం విజయం సాధించగా, ఆ పార్టీ తరుపున అవనిగడ్డ ఎమ్మెల్యేగా ప్రస్తుతం జనసేన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ గెలుపొందారు. ఎన్నికల సమయంలో కాపుల కోసం ప్రత్యేక సంక్షేమ భవనాన్ని నిర్మిస్తామంటూ నాడు బుద్ధప్రసాద్ హామీ ఇచ్చారు. ప్రధాన సెంటర్‌లోని గొల్లపాలెం రహదారిలోని కేడీసీసీ బ్యాంక్ సమీపంలో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని కూడా ఆవిష్కరించారు. భవనానికి రూ.50లక్షల నిధులు మంజూరు చేశామని గొప్పలు చెప్పారు. అయితే నాటి టీడీపీ ప్రభుత్వంలో 2019 ఎన్నికల ముందు హడావుడిగా వేసిన శిలాఫలకం ముళ్లపొదలకే పరిమితమైయింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, మళ్లీ బుద్ధప్రసాద్ ఎమ్మెల్యేగా ఉండటంతో ఈ భవన నిర్మాణంపై దృష్టి సారించాలని కాపు సంఘ నేతలు డిమాండ్ చేస్తున్నారు. గతంలో లాగా కాకుండా ఈసారి నిధులు మంజూరు చేసి వెంటనే భవన నిర్మాణ పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జీవన ఎరువుల వినియోగంపై అవగాహన



ఘంటసాల: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి అధ్యక్షతన జీవన ఎరువుల అవగాహన వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్తలు జీవన ఎరువులు వినియోగించే విధానాన్ని నైపుణ్యత ప్రదర్శన ద్వారా రైతులకు, గృహ విజ్ఞాన కళాశాల, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు, గ్రామీణ యువతకు అవగాహన కల్పించారు. జీవన ఎరువులతో కలిగే లాభాలు, ఉపయోగాలను శాస్త్రవేత్తలు వివరించారు. కార్యక్రమంలో కేవీకే సస్యపోషణ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి, సస్య రక్షణ శాస్త్రవేత్త డాక్టర్ కె.రేవతి పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా..?

కోడూరు: మండలంలోని దింటిమెరక - హంసలదీవి ప్రధాన రహదారి పొడవునా ముళ్లచెట్లు అల్లుకుపోవడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దింటిమెరక నుంచి హంసలదీవి మలుపు సుమారు ఆరు కిలోమీటర్ల మేర రహదారికి ఇరువైపులా ముళ్లకంప పెరిగిపోయింది. దీని కారణంగా రహదారి మధ్యభాగంలో మాత్రమే వాహన రాకపోకలు సాగించేందుకు వీలు ఉంది. ఈ ముళ్లకంప కారణంగా రహదారి వెంట ప్రయాణించే పాలకాయతిప్ప, హంసలదీవి గ్రామస్తులు, సమీప పొలాల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్రవాహనాలపై వెళ్తుంటే ముళ్లకంప మొఖాలకు తగిలి గాయాలవుతున్నాయని వాహనచోదకులు వాపోతున్నారు. ఎదురుగా రెండు వాహనాలు వస్తే పక్కకు జరిగే పరిస్థితి కూడా లేదు. కోడూరు నుంచి హంసలదీవి బీచ్‌కు వెళ్లేందుకు కూడా ఈ రహదారే దగ్గర మార్గం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి వెంటనే ముళ్లకంపను తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ బ్రాంచి మచిలీపట్నం వారు ... [illegible] ... తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరాలకు నా క్లయింట్ బాధ్యులు కారు.

షెడ్యూల్ : కృష్ణాజిల్లా, మచిలీపట్నం ... [illegible] ... గూడూరు మండలం ... దస్తావేజు నెం. 2452/2017లో ... [illegible]

యు.వి. సుబ్రహ్మణ్యేశ్వరరావు, న్యాయవాది, మచిలీపట్నం

ప్రకటన

[illegible] ... సదరు 1) గొర్తి రాజేశ్వరరావు, 2) గొర్తి వెంకటేశ్వరరావు, 3) గొర్తి వారువేద వెంకట సత్యనారాయణ మూర్తి, 4) గొర్తి కృష్ణప్రసాద్ ... [illegible] ...

షెడ్యూలు :- కృష్ణాజిల్లా, మచిలీపట్నం ... [illegible] ...

ఇట్లు, తోట విజయశంకర్, బి.ఎస్.సి., బి.ఎల్., అడ్వకేటు, డోర్ నెం. 20/16, ... మచిలీపట్నం, సెల్: [illegible]

మచిలీపట్నం, తేది : 14.10.2025

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

మచిలీపట్నం డివిజన్

99122 20543 (మచిలీపట్నం, పెడన)

79955 66983 (అవనిగడ్డ)

Office mail : sakshiads@gmail.com